సాక్షి నిజామాబాద్

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారిని వివిధ రూపాల్లో భక్తిశ్రద్ధలతో కొలిచారు. జిల్లా కేంద్రంలోని అశోక్ టవర్స్‌లో అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. – నిజామాబాద్ రూరల్

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాం పరిశీలన



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా ఈవీఎం గోదాము వెళ్లిన ఆయన.. సీల్‌ను, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్ రావు తదితరులున్నారు.

ప్రజావాణికి 84 ఫిర్యాదులు



నిజామాబాద్‌అర్బన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 84 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం ఆధ్వర్యంలో సోమవారం కలిశారు. నూతన కార్యవర్గానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వీరేందర్ సింగ్, రేఖ, కళావతి, గోపాల్, శ్రీను, రవికుమార్, కృష్ణ, చైతన్య, ప్రసాద్, కే శంకర్, పాషా ఎన్నికయ్యారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. 21,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే స్థాయిలో నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 12 వేలు, సరస్వతి కాలువ ద్వారా 500, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా, సోమవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.



లే అవుట్‌లో విద్యుత్ లైన్లు

రైల్వే జోన్‌లో వెంచర్!

- లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించిన శ్రీ అశోక ఎన్‌క్లేవ్ బిల్డర్లు
- హాట్‌కేకుల మాదిరిగా అమ్ముకుని సొమ్ముచేసుకున్నారు
- లబోదిబోమంటున్న బాధితులు.. తమకేం సంబంధం లేదంటున్న ప్లాట్ల విక్రేతలు



అశోక ఎన్‌క్లేవ్ ముఖద్వారం

వారంతా మధ్య తరగతి వారే.. పైసా పైసా కూడబెట్టి దాచుకున్న సొమ్ముతో నిజామాబాద్ నగరం బై పాస్ రోడ్డులో గల శ్రీ అశోక ఎన్‌క్లేవ్‌లో ప్లాట్లను కొనుగోలు చేశారు. తీరా అవి రైల్వే జోన్‌లో ఉన్న భూములని తెలిసి లబోదిబోమంటున్నారు. రైల్వే జోన్ భూములని తెలిసీ సదరు బిల్డర్లు ఈ వెంచర్ వేయడం విస్మయం కలిగించే అంశం.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హైడ్రా.. ప్రస్తుతం రాష్ట్రంలో అత్యధికంగా చర్చలో ఉన్న అంశం. ఈ క్రమంలో దీన్ని జిల్లాలకు విస్తరించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వం సైతం ఈ దిశగా ఆలోచన చేస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తాజాగా జిల్లా పర్యటనలో ప్రకటించారు. ప్రభుత్వ, ఎండోమెంట్, వక్ఫ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, కాలువలు, నాలాలు, చెరువులు, కుంటల్లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఇచ్చిన అనుమతులన్నీ సరైనవేనా అనే అనుమానాలు ప్లాట్లు కొనుగోలు చేసినవారిని వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ భూములు, రైల్వే జోన్‌లోని భూములు, విమానాశ్రయ రేడియస్‌లోని భూముల విషయంలో కచ్చితమైన నిబంధనలు ఉంటాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ నిజామాబాద్ నగరం బైపాస్ రోడ్డులోని రైల్వే లైన్ పక్కన, రైల్వే జోన్ భూముల్లో శ్రీ అశోక ఎన్‌క్లేవ్ పేరిట లే అవుట్ వేశారు. ఇక్కడ కీలకమైన అంశమేమిటంటే ఇవి రైల్వే జోన్‌లో ఉన్న భూములని తెలిసినప్పటికీ సదరు అశోక బిల్డర్ బాధ్యులు ఈ వెంచర్‌ను వేయడం. పైగా వీటికి సంబంధించి నుడా నుంచి అనుమతులు, విద్యుత్‌శాఖ ద్వారా లేఅవుట్‌లో పూర్తిస్థాయిలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు బర్త్, డెత్ సర్టిఫికెట్ నుంచి చిన్న చిన్న పనులు చేసేందుకే వందలసార్లు కార్యాలయాల చుట్టూ తిప్పించుకునే అధికారులు ఇక్కడ మాత్రం అన్ని నిబంధనలు అతిక్రమించినప్పటికీ యుద్ధప్రాతిపదికన అనుమతులు ఇవ్వడం విశేషం.



గతంలోనే రైల్వే శాఖ రూపొందించిన రైల్వే లైన్ మ్యాప్

రైల్వే జోన్ అని తెలిసినప్పటికీ..

బైపాస్ రోడ్డులోని రైల్వే లైన్‌కు ఆనుకుని ఉన్న రైల్వే జోన్ పరిధిలో అశోక ఎన్‌క్లేవ్ ఏర్పాటు చేశారు. దీనికి నుడా అనుమతులు ఏవిధంగా ఇచ్చారనేది కూడా బహిరంగ రహస్యమే. ఇందులో మొత్తం 187 ప్లాట్లు ఏర్పాటు చేశారు. అన్ని ప్లాట్లను అశోక బిల్డర్ సభ్యులు హాట్ కేకుల మాదిరిగా అమ్మేశారు. మించిపోతే ఇలాంటి మంచి తరుణం దొరకదంటూ ఆకర్షించారు. చాలామంది పైసా పైసా కూడబెట్టుకున్న డబ్బులతో పిల్లల భవిష్యత్తు చదువులు, ఆడపిల్లల వివాహాల కోసం పెట్టుబడి మాదిరిగా ప్లాట్లను కొనుగోలు చేశారు. ఇలా కొనుగోలు చేసిన వారిలో దాదాపు అందరూ మధ్యతరగతి వారే ఉన్నారు. ఎక్కువ మందికి ప్లాట్ కొనుగోలు కోసం చేసిన అప్పులు సైతం ఇంతవరకు తీరలేదు. ఈ నేపథ్యంలో పిడుగు మాదిరిగా రైల్వే లైన్ ఏర్పాటు ప్రకటన వచ్చింది. ప్లాట్లు కొనుక్కున్నవారు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై అశోక బిల్డర్స్ బాధ్యులను అడిగితే తమకేం సంబంధం లేదంటూ ముఖం చాటేస్తున్నారు. ఇటీవల ఈ ప్లాట్ల కొనుగోలుదారులంతా కలిసి కలెక్టరుకు వినతి పత్రం ఇచ్చారు. రైల్వే లైన్‌ను రద్దు చేయాలంటూ వినతి పత్రంలో కోరారు. విచిత్రమేమిటంటే ఈ రైల్వే లైన్‌ను రద్దు చేయిస్తామంటూ ఈ లేఅవుట్ వేసిన ప్రబుద్ధులు కొనుగోలు దారులను మభ్యపెడుతూ మరోసారి మోసం చేస్తుండడం. ఈ విషయంలో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకున్న ఈ బిల్డర్లు ఈసారి సరికొత్త ముచ్చట్లు చెబుతుండడం విశేషం. తమకు అధికార కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులందరూ అత్యంత సన్నిహితులని, తమను ఎవరూ ఏంచేయలేరనే ధీమాను వ్యక్తం చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కొనసాగుతున్న గేట్ల మరమ్మతులు



గేట్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటితో నిండుకుండలా ఉన్నప్పటికీ వరద గేట్ల మరమ్మతు పనులు మాత్రం ఆగడం లేదు. గేట్ల మరమ్మతుల కోసం గత 2022లో అప్పటి ప్రభుత్వం రూ.17.5 కోట్లు మంజూరు చేయగా, అప్పటి నుంచి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 42 గేట్లకు గాను 30 గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టంతో ఉన్నప్పటికీ స్టాప్‌లాక్ గేట్లు వేసి పనులు చేపడుతున్నారు. ఇప్పటి నుంచే పనులను వేగంగా చేపట్టి వేసవి నాటిని పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గేట్ల మరమ్మతుల పనుల్లో భాగంగా కొత్త రోప్ వేస్తున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ కాలం నుంచి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో గేట్ల మరమ్మతులు చేపట్టలేదు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీరున్నా ఆగని పనులు

ప్రాజెక్టులో నీరు నిండుగా ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా గేట్ల మరమ్మతులు కొనసాగుతున్నాయి. నీరు లీకేజీ ద్వారా వెళ్లకుండా అడ్డుగా స్టాప్‌లాక్ గేట్లు వేస్తున్నారు. ఇలా వేయడంతో నీరు వెళ్లే అవకాశం ఉండదు. పనులను వేగంగా చేయాలని సూచించాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని



ప్రీతి

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన పుల్ల ప్రీతి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని సోమవారం తెలిపారు. ఈనెల 9, 10, 11వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే పోటీల్లో ప్రీతి పాల్గొంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బోనాఫైడ్ రిజెక్ట్

- కొంపముంచిన గుర్తింపులేని పాఠశాలలు
- ఉద్యోగాలకు దూరమైన డీఎస్సీ అభ్యర్థులు



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీ – 2024కు ఎంపికైన పలువురు అభ్యర్థుల ఆశలను బోనాఫైడ్‌లు గల్లంతు చేశాయి. గుర్తింపు లేని పాఠశాలల నుంచి జారీ అయిన బోనాఫైడ్‌లు జిల్లా విద్యాశాఖ చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఒకరిద్దరు కాదు సుమారు 76 మందికిపైగా అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు.

జిల్లాలో 601 ఒక పోస్టులకుగాను 1350 మంది అభ్యర్థులను 1:3 చొప్పున ఎంపిక చేసి ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అయితే 1980 – 90 మధ్యకాలంలో గుర్తింపు లేని ప్రైవేట్‌పాఠశాలల్లో చదివిన అభ్యర్థులకు సమస్య ఎదురైంది. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు తాము ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సంబంధిత జిల్లాలో చదివినట్లు బోనాఫైడ్ సమర్పించాల్సి ఉంటుంది. 75 మందికిపైగా అభ్యర్థులు తీసుకువచ్చిన బోనాఫైడ్‌ను పరిశీలించిన అధికారులు అవి గుర్తింపులేని పాఠశాలల నుంచి పొందినవని తేల్చారు. ఆ అభ్యర్థులను బోనాఫైడ్‌ల విషయంలో పక్కకు పెట్టేశారు. ఫలితాలు వెలువడిన మరుసటి రోజే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడం అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేసింది. 1350 మంది అభ్యర్థులకుగాను విద్యాశాఖ 5 రోజుల్లో 1250 మంది అభ్యర్థుల ధ్రుపత్రాలను పరిశీలించింది. మిగతావారు గైర్హాజరయ్యారు.

ప్రస్తుతం కూడా అదే పరిస్థితి

జిల్లాలో ఇప్పటికీ ఎన్నో పాఠశాలలు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయి. అందులో జిల్లా కేంద్రంలోనే సుమారు 15 పాఠశాలలున్నాయి. కొన్ని పాఠశాలలను ఇతర స్కూళ్ల గుర్తింపుపై కొనసాగిస్తున్నారు. బోధన్ రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాల గుర్తింపును ఇదే ప్రాంతంలోని ఎనిమిది పాఠశాలలు వినియోగించుకుని అనధికారికంగా కొనసాగుతున్నాయి. భీమ్‌గల్ మండల కేంద్రంలో మరో ప్రైవేట్ పాఠశాలను తప్పుడు ధ్రువపత్రాలతో మండల విద్యాశాఖ అధికారులను తప్పుదోవ పట్టించి కొనసాగిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు అందింది. ఆర్మూర్‌ల్ నాలుగు ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు గుర్తింపు కోసం అసలు దరఖాస్తు చేసుకోవడం లేదు. విద్యాశాఖ ఉన్నతాధికారులు అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

- నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి
- అట్టహాసంగా నిజామాబాద్ ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్ చైర్మన్ రాంచందర్.. పక్కన ఎమ్మెల్యేలు

సుభాష్‌నగర్: వ్యవసాయంపై యువత ఆసక్తి చూపాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శ్రద్ధానంద్ గంజ్‌లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి సమక్షంలో కార్యా లయంలో చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌తో డీఎంవో గంగు, డైరెక్టర్లతో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాంషుగర్స్‌ను తెరిపిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నాయకత్వంలో రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు నిజాంషుగర్స్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు చేతగాని దద్దమ్మలని, రైతులు అన్నిరకాల పంటలు పండించేలా మార్కెటింగ్‌శాఖ, పాలక వర్గం అవగాహన కల్పించాలన్నారు.

మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

వ్యవసాయ మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకువచ్చే బాధ్యత పాలకవర్గం తీసుకోవాలని, రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన నిజామాబాద్ ఏఎంసీకి సీనియర్ నాయకుడు, రైతుబిడ్డ ముప్ప గంగారెడ్డి చైర్మన్ కావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో మార్కెట్ షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని, పంట దిగుబడులకు మంచి ధర దక్కేలా చొరవ చూపాలని పాలకవర్గానికి సూచించారు. సద్దిమూట కార్యక్రమాన్ని పునఃప్రారంభించి రైతులకు మధ్యాహ్నభోజన సౌకర్యాన్ని కల్పించాలన్నారు.

మార్కెట్‌లో మార్క్ చూపిస్తాం

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యేల సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం తనకు గురుతర బాధ్యతను అప్పగించిందని, పాలకవర్గం, అధికారుల సహకారంతో మార్కెట్‌లో తమ మార్క్ చూపిస్తామని చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతు కుటుంబానికి చెందిన తనకు చైర్మన్ పదవి ఇచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచన మేరకు మార్కెట్‌లో రైతులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేస్తామన్నారు.

సన్మానాలు

చైర్మన్, వైస్ చైర్మన్ సహా డైరెక్టర్లు ఓపెన్ టాప్ జీపులో డప్పు వాయిద్యాల నడుమ మార్కెట్‌లోకి ర్యాలీగా వచ్చారు. ప్రమాణస్వీకారం చేసే సమయంలో టపాకాయలు కాల్చారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిని చైర్మన్ ముప్ప గంగారెడ్డి గజమాలలతో సన్మానించారు. నూతన పాలక వర్గాన్ని ఆయా మండలాల నాయకులు, అనుచరులు, శ్రేయోభిలాషులు, రైస్‌మిల్ అసోసియేషన్, మర్చంట్ అసోసియేషన్, వెజిటేబుల్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రమాణస్వీకారోత్స కార్యక్రమానికి నాలుగు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, సుంకెట అన్వేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పీసీసీ నాయకులు నగేశ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్, కేశ వేణు, జావీద్ అక్రమ్, డీసీసీబీ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మోపాల్ మండలం బాడ్సిలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబురం

పల్లె, పట్నం తేడాలేకుండా జిల్లా బతుకమ్మ సంబురాలతో కళకళలాడుతోంది. ఆడపడచులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేరుస్తూ ఆడిపాడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.

నాణ్యతా ప్రమాణాలతోనే పూర్తి రక్షణ



సుభాష్‌నగర్: అంతర్జాతీయ వస్తు, సేవల నాణ్యతా ప్రమాణాల ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను నిజామాబాద్ మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ సోమవారం ఆవిష్కరించారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, సరుకులు, సేవలకు నాణ్యతాప్రమాణాలు పూర్తి రక్షణగా ఉంటాయని ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి అన్నారు. మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వినియోగదారుల సంఘాలతో కలిసి ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆరు డివిజన్లకు ఇన్‌చార్జిలను నియమించారు. వినియోగదారులు సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ కుమార్, నాయకులు వీఎస్ వర్మ, శ్రీనివాస్, గైని రత్నాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు



బాన్సువాడ రూరల్(బాన్సువాడ): బతుకమ్మల నిమజ్జనానికి మండలంలోని ఇబ్రహీంపేట్ చెరువు కట్టపైన సోమవారం ట్రాక్టర్ బ్లేడ్‌తో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే విద్యుత్ దీపాలను అమర్చుతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ తెలిపారు. పండుగల నేపథ్యంలో గ్రామంలోని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతు గ్రామస్తులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈ విజయసారథికి వినతి పత్రం అందించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికంగా లోడ్ పడటంతో తరుచూ ఫ్యూజులు పోయి విద్యుత్ సమస్య ఏర్పడుతోందన్నారు. దీంతో పాటు పలు కాలనీలలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని.. సరి చేయాలని కోరారు.

కోర్సులపై అవగాహన



బాన్సువాడ: వృత్తి విద్య కోర్సులపై సోమవారం కొత్తాబాది మోడల్ స్కూల్ విద్యార్థులకు బాన్సువాడ ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. హెల్త్‌కేర్ విభాగంలోని ఫార్మసీ, పిల్లల ఓపీ, ఇంజక్షన్ ఓపీ, లేబర్ వార్డు, ప్రథమ చికిత్స, వ్యాక్సినేషన్, బీపీ పరీక్ష, రక్త నమూనాల సేకరణ, తదితర అంశాల గురించి విద్యార్థులకు శిక్షకురాలు సుజాత వివరించి చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమం పది రోజుల పాటు కొనసాగుతుందని, ఈ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆమె అన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెలబెట్టుకుంటోంది
- నూతన పాలకవర్గాలు రైతులకు అందుబాటులో ఉండాలి
- వేల్పూర్, కమ్మర్‌పల్లి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రైతుల సంక్షేమానికి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) సభ్యులు పాటుపడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. వేల్పూర్, కమ్మర్‌పల్లిలో సోమవారం నిర్వహించిన నూతన ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం వారి స్వార్థం కోసం పనిచేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా అధికారి

కమ్మర్‌పల్లి: రూ. లక్ష రైతు రుణమాఫీకి బీఆర్‌ఎస్‌కు పదేళ్లు పడితే, తమ ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ. రెండు లక్షల రుణమాఫీ చేసి చూయించిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లిలోని లలితా గార్డెన్స్‌లో నిర్వహించిన కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో లేకున్నా పార్టీ కోసం పదేళ్ల పాటు కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారికి న్యాయం చేస్తోందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ అన్నారు. పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ అనేదే లేదని, అంతా ఒక్కటై పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్. గంగు చైర్మన్‌గా పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్‌గా సుంకెట బుచ్చన్న, సభ్యులుగా జైడి మధులత, రిక్క ముత్తెన్న, నర్సాపురం జీవన్, కిస్తి చిన్న బాబన్న, బానవత్ రాములు, రొక్కం సంపత్, లక్క రంజిత్, కోరిపెల్లి లింగారెడ్డి, భూత్‌పురం మహిపాల్, అబ్దుల్ నవీద్, జవ్వాజీ శ్రీనివాస్, జొన్నల నడ్పి భూమయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, నాయకులు రవి, తిప్పిరెడ్డి శ్రీను, మహ్మద్ అబ్దుల్ రఫీ, బుచ్చి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి కట్టుబడి ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వేల్పూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కొందరి రైతుల అకౌంట్ల వివరాలు సరిగా లేకపోవడంతోనే రుణమాఫీ కాలేదని వారి కోసం కేటాయించిన నిధులు బ్యాంకుల్లో అలాగే ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే వంగడాలను కొద్దికొద్దిగా సాగుచేస్తూ విస్తీర్ణం పెంచాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ప్రసంగించారు. అనంతరం నూతన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్, నాయకులు అరికెల నర్సారెడ్డి, నగేశ్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, మారచంద్రమోహన్, వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సహకారమా..'స్వాహా'కారమా!

- పారదర్శకత పాతర.. అక్రమాల జాతర
- పంటరుణం తీసుకోకున్నా బాకీ చూపుతున్న వైనం
- నమోదులో తప్పులతో రుణమాఫీకి దూరమైన రైతులు



రెంజల్‌లోని విండో కార్యాలయం

రెంజల్: రైతులకు సకాలంలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఎరువులను అందించే సహకార సంఘాల నిర్వహణ గాడి తప్పుతోంది. రైతులకు తెలియకుండానే వారి పేర్ల మీద రుణాలు తీసుకుని జేబులో వేసుకోవడం, ఎరువులు విక్రయించగా వచ్చిన సొమ్మును పక్కదారి పట్టించడం, ధాన్యం విక్రయించగా వచ్చిన రైతుల సొమ్మును దుర్వినియోగించడం నిత్యకృత్యమైతుంది. ఏటా ఆడిట్ అధికారులు నిర్వహించే తనిఖీలు నామమాత్రంగానే సాగడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(ప్యాక్స్) ఉద్యోగులు, సిబ్బంది అవినీతి, అక్రమాలకు తావిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో రైతులు బాంబేలెత్తుతున్నారు. రెంజల్ విండో పరిధిలోని బోర్గాం గ్రామంలో సుమారు 10 మంది రైతులు సొసైటీలో షేర్ హోల్డర్లుగా ఉన్నారు. వారి పేరున పంట రుణాలు తీసుకున్నట్లు గుర్తించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరి కొందరు రైతులు 15 ఏళ్ల క్రితమే రుణాలు చెల్లించి సహకార సంఘాల్లో ఖాతాలను క్లోజ్ చేసుకుని వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. సంఘంలో బాకీలేనట్లు నోడ్యూస్ సరిఫికెట్ తీసుకోకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వారి పేరున తక్కువ మొత్తంలో రుణమాఫీ అయినట్లు సెల్‌ఫోన్‌లకు మెస్సేజ్‌లు వచ్చాయి.

నమోదులో తప్పులతో..

సహకార వ్యవస్థ పట్టుతప్పుతోంది. సంఘాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యంతో వందలాది మంది రైతులు ప్రభుత్వం విడతల వారిగా ప్రకటించిన రుణమాఫీకి దూరమయ్యారు. ఒకరికి చెందిన ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను మరో రైతు పేరున చేర్చడంతో ఇరువురికి రుణమాఫీ వర్తించకుండా పోయింది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా రైతుల పరిస్థితి తయారైంది.

ఆధార్ మ్యాపింగ్‌తో సమస్యలు

ఆధార్ మ్యాపింగ్ కావడంతో పొరపాట్లు జరిగాయి. రైతులు ప్రతీ ఏడాది రుణాలను రెన్యూవల్ చేసుకోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సమస్య తలెత్తింది. వాటిని సరిచేసే అధికారం సెంట్రల్ సర్వీసెస్ ప్రకారం డీసీసీబీ, టెస్కాబ్‌లకు మాత్రమే ఉంది. రైతులు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తే ఆడిటర్‌ను పంపించి, విచారణ చేపట్టి న్యాయం చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార అధికారి

రూ. 34వేల రుణం ఉన్నట్లు..



రెంజల్ విండోలో ఇప్పటి వరకు అప్పు తీసుకోలేదు. షేర్ హోల్డర్‌గా మాత్రమే కొనసాగుతున్నాను. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరున రూ.34 వేల రుణం ఉన్నట్లు తెలిసింది. అది కూడా మాఫీలో రాలేదు. నాలాగే మా గ్రామంలో పది మంది రైతులు రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్లు వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఇదాయత్‌బేగ్, రైతు, బోర్గాం

ఖాతా క్లోజ్ చేసినా..



ఎడపల్లి మండలం జైతాపూర్ సొసైటీలో 2005లో ఖాతా క్లోజ్ చేశాను. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో తన పేరున సొసైటీలో రూ.4850 మాఫీ అయినట్లు సమాచారం వచ్చింది. వారి తప్పిదం వల్లే రెంజల్‌లోని కెనారా బ్యాంకులో రుణ మాఫీ రాకుండాపోయింది. అధికారులు తప్పును సరిచేయాలి. రైతులను సమస్యలను పరిష్కరించాలి.

– నారాయణ, రైతు, దండిగుట్ట

'ఉపాధిహామీ'లో అక్రమాలు



సామాజిక ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు

- బినామీలతో ఉపాధి పనులు
- సామాజిక తనిఖీలో బహిర్గతం

కామారెడ్డి రూరల్: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. ఉపాధిహామీ పనుల్లో బినామీల రాజ్యం నడుస్తోంది. జిల్లా కేంద్రమైన కామారెడ్డి మండలంలో సోమవారం నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో బినామీల పర్వం తేట తెల్లమైంది. ఉపాధి హామీ చట్టం ప్రారంభమై 19 ఏళ్లు కావస్తున్నా గ్రామ, మండల, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇంకా లోపాలు బహిర్గతమవుతున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావేదిక సభలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పనులు చేయకుండానే కూలీల పేరుపై డబ్బులు వేసి డ్రా చేసినట్లుగా తేలింది. మస్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, మొక్కల పెంపకంలో జరిగిన అక్రమాలు వెల్లడయ్యాయి. అరకొర వసతులు ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ ప్రజావేదికను తొందరగా ముగించారు. ఏపీడీ వామన్‌రావు మాట్లాడుతూ.. తనిఖీల్లో బయటపడిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రశాంత్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాఘవన్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌పీ మహేశ్వర్, ఎంపీడీవో నాగవర్ధన్, ఏపీవో నరేందర్, టీఆర్ పీలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాస్‌బుక్‌లపై విచారణ చేపట్టాలి



మోపాల్: సిర్పూర్ రెవెన్యూ శివారులో ఉన్న సర్వేనెంబర్ 602, 830లో గల భూమి పట్టా పాస్ బుక్కులపై విచారణ చేపట్టి రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్, నిజామాబాద్ ఆర్డీవోలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో పైన పేర్కొన్న సర్వేనెంబర్లలో ప్రజలకు భూమి పట్టాపాస్ బుక్‌లు పంపిణీ చేశారని, అందులో ఉన్న వ్యక్తులు తమ గ్రామానికి చెందిన వారు కాదని తెలిపారు. ఈ పాస్‌బుక్‌లను సొసైటీలు, బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందారన్నారు. గ్రామంలో భూమి లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, పాస్‌బుక్‌లపై విచారణ చేపట్టి వాటిని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పువ్వులను పూజించడం తెలంగాణ సంస్కృతి



బతుకమ్మలతో పోలీసు కుటుంబ సభ్యులు

ఖలీల్‌వాడి: పువ్వులను పూజించడం మన తెలంగాణ గొప్ప సంస్కృతి అని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో మహిళా పోలీస్ సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులతో కలిసి ఆట, పాటలతో బతుకమ్మ సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడటం, ఇంత మంది కుటుంబ సభ్యులను కలవడం, వారితో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు, డీసీపీ (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి, డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, పోలీస్ కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా ఓవరాల్ చాంపియన్‌గా నిజామాబాద్ జిల్లా



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ విన్యాసలతో ఆకట్టుకొని ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జిల్లా జట్టు కైవసం చేసుకుంది. సెప్టెంబర్ 28, 29వ తేదిల్లో పటాన్‌చెరువులో సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల పోటీలు, సీనియర్ మెన్, ఉమెన్ ఏ, బీ, సీ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. అతి పురాతనమైన యోగాను ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాల్లో అభ్యసిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారన్నారు. యోగాను ఒక క్రీడగా గుర్తించి స్పోర్ట్స్ కోట ఇవ్వడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యోగా రాంచంద్రం, కార్యదర్శి టి బాల శేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి జి సంగీత, సీనియర్ యోగాచార్యులు ఎ ప్రభాకర్, ట్రెజరర్ భూమా, సభ్యులు టి జ్యోతి, ఎం రఘువీర్ పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చేప పిల్లలను పెంచుకోవడంతో అధిక లాభాలు పొందవచ్చని లీడ్ మేనేజరు రవికాంత్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో సోమవారం చేప పిల్లల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చేప పిల్లలను పెంచినట్లయితే సంవత్సరానికి రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. బ్యాంకు ఖాతాలు, పట్టాపాస్ పుస్తకాలు ఉన్న వారికి సబ్సిడీపై బ్యాంకులలో లోన్ ఇప్పిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ట్రైనర్ ఉదయ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ఆర్మూర్‌టౌన్: ఆలయ గుడి గంటలు చోరీ చేసిన కేసులో షేక్ బాబు, షేక్ హైదర్‌కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఒక ఏడాది సాధారణ జైలుతో పాటు రూ.వేయి జరిమానా విధించినట్లు ఏర్గట్ల ఎస్సై బాపుల రాము సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ బాబు, షేక్ హైదర్ 2023 డిసెంబర్19న ఏర్గట్ల శివారులోని శివాలయం తాళాలు ధ్వంసం చేసి గుడి గంటలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన కొలిప్యాక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై జక్కుల మచ్చేందర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సోమవారం సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితులను ఏడాది జైలు శిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు. కాగా షేక్ హైదర్ మరో నేరంలో ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

చెట్లు నరికినందుకు జరిమానా



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో చెట్లు నరికిన ముగ్గురు రైతులకు జరిమానా విధించినట్లు పంచాయతీ కార్యదర్శి నరేశ్ సోమవారం తెలిపారు. గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లు అయ్యాయి. గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలాల్లో పంటలకు నీడ వస్తోందని చెట్లను నరికివేశారు. దీంతో ముగ్గురికి చెట్టుకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఎవరైనా హరితహారం మొక్కలు, చెట్లను నరికితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టయ్యఫారంలో చోరీ

నవీపేట: మండలంలోని మట్టయ్య ఫారం గ్రామానికి చెందిన కేతావత్ అర్జున్ ఇంట్లో దుండగులు చొరబడి బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి అర్జున్ తన భార్య లత, పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రపోయాడు. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఎలాంటి చప్పుడు కాకుండా లత మెడలో ఉన్న అరతులం బంగారు పుస్తెలతాడు, రెండు సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ సమస్యలతో ఒకరి ఆత్మహత్య

బీబీనగర్: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై రమేశ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామానికి చెందిన జిరిగె సునీల్‌కుమార్(34) బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అద్దెకు ఉంటూ స్థానిక మాజీ ఎంపీటీసీకి చెందిన ఫాంహౌస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో సునీల్‌కుమార్ కొంత కాలంగా మానసిక ఒత్తిడికి లోనై ఆదివారం రాత్రి అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



షేక్ లాయక్ (ఫైల్)

బోధన్‌టౌన్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బోధన్ పట్టణంలోని బీటీనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బీటీ నగర్ కాలనీకి చెందిన షేక్ లాయక్(24) అలియాస్ లల్లూ అనే యువకుడు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు అతని స్నేహితులు అర్బాజ్, షేక్ మారూఫ్, జునేద్‌తో కలిసి ఆటోలో పట్టణ శివారులోని రాయ్‌కూర్ రోడ్డు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ లాయక్ తీవ్రంగా గాయపడడంతో ఆటోలో తీసుకెళ్లిన మిత్రులు అతడిని రవిగార్డెన్ ప్రాంతంలో ఉంచి మరో మిత్రుడు పవన్‌కు ఫోన్ చేసి ఇక్కడ లాయక్ స్పృహ తప్పి పడిపోయాడని సమాచారం అందించి పరారయ్యారు. వెంటనే పవన్ తన మిత్రులతో కలిసి రవి గార్డెన్ ప్రాంతంలో ఉన్న ఆటోలో లాయక్ తీవ్ర రక్తపు మరకలతో ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు లాయక్ మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, మృతుడి తండ్రి అబ్దుల్లా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడు తన మిత్రులతో కలిసి రాయ్‌కుమార్ రోడ్డులో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఇనుప రాడ్‌ల చోరీకి వెళ్లగా అక్కడ గొడవపడి లయక్‌ను హత్య చేశారా.. లేదా రాడ్‌లు చోరీ చేసి ఆటోలో వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత..

సదాశివనగర్: ఇంట్లో జరిగిన గొడవలకు ఆత్మహత్యకు పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం భూంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. భూంపల్లికి చెందిన మొగ్గం జ్యోతి(30) అదే గ్రామానికి చెందిన నవీన్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలంటు జ్యోతిని నవీన్ వేధిస్తున్నాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల జ్యోతి భర్తకు చెప్పకుండా పుట్టింటికి వెళ్లింది. తనకు చెప్పకుండా ఎందుకు వెళ్లావంటు భర్త గొడవకు దిగడంతో మనస్తాపంతో ఈ నెల 5న ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న జ్యోతిని గుర్తించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి మీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సాగర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్సై ఆంజనేయులు

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్‌లో దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంప రాజేందర్ కుటుంబీకులు ఈ నెల 2న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోనే కొనసాగుతున్న కిరాణ దుకాణంలో రూ. 22,300 నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా విచారణలో ముత్యంపేట గ్రామానికి చెందిన గరుగుల భరత్, కొండయ్యల రాజవ్వ అలియాస్ రజిత చోరీకి పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఎడపల్లి: మండలంలోని ఠాణాకలాన్ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సోమవారం ఠాణాకలాన్ శివారులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659873, 8712659780 నంబర్లను సంప్రదించాలని ఎస్సై వంశీధర్‌రెడ్డి కోరారు.

వాహనాల తనిఖీలు.. తగ్గిన రోడ్డు ప్రమాదాలు

ఖలీల్‌వాడి: వాహనాల తనిఖీలతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 625 ప్రమాదాలు జరిగితే ఇందులో 257 మంది మృతి చెందినట్లు తెలిపారు. జనవరి నుంచి మే నెల వరకు 173 మంది మరణిస్తే, జూన్ నెలలో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్స్, నంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలు, ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా ప్రయాణించడం, మైనర్ డ్రైవింగ్ లాంటి వాటి మీద టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాంలు తగ్గాయని పేర్కొన్నారు. విస్తృత తనిఖీలతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 84 మంది మృతి చెందినట్లు తెలిపారు. 2022 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 44 శాతం, 2023లో 40 శాతం మంది మృతి చెందితే, 2024లో 39 శాతం మంది మరణించినట్లు పేర్కొన్నారు. ట్రాన్స్ పోర్ట్, పోలీస్ డిపార్ట్‌మెంట్ కలిసి జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 2800కు పైగా కేసులు, రూల్స్‌ను అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించినట్లు తెలిపారు. గత నెల సెప్టెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాపాయం ఉండదని వెల్లడించారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి

మాచారెడ్డి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌పై ఓ వ్యక్తి దాడిచేసిన ఘటన పాల్వంచ మండలం ఇసాయిపేట్‌లో చోటు చేసుకుంది. ఇసాయిపేట్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ పెనుబల్లి కొండారెడ్డి ఆదివారం రాత్రి సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్‌లోకి కరెంటు చేంజ్ చేస్తుండగా ఇసాయిపేట్ గ్రామానికి చెందిన కురుమ సంతోష్ సబ్‌స్టేషన్‌లోకి వచ్చి కరెంటు ఎందుకు పోయిందంటు బూతులు తిడుతూ దాడి చేశాడు. ఆపరేటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.